ప్రజాశక్తి
ఆదివారం 19 మే 2024 | 5 | శ్రీ సత్యసాయి

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద

కుటుంబంపై మృత్యువేట

మరికొద్ది రోజుల్లో వివాహం జరగాల్సిన ఇంట చావుమేళం మోగింది. ఎంతో సంతోషంగా పెళ్లికి కావాల్సిన బట్టలు కొనుగోలు చేసేందుకు వెళ్లిన వారికి అదే చివరి ప్రయాణం అయ్యింది. రోడ్డు ప్రమాదం రూపంలో ఆ కుటుంబాన్ని మృత్యువు కబళించింది. పెళ్లి కుమారునితో సహా అతని కుటుంబ సభ్యులు ఆరుగురు మరణించారు. మృతులంతా ఒకే కుటుంబ సభ్యులు కావడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. శనివారం వేకువజామున అనంతపురం జిల్లా గుత్తి మండలం బాటసుంకులమ్మ ఆలయ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అనంతపురం నగరం బిందెల కాలనీకి చెందిన ఆరుగురు మృత్యువాత పడ్డారు.

ప్రమాదంలో మృతి చెందినవారు

షేక్ ఆలీసాహెబ్

షేక్ జహీదా

షేక్ రెహనాబాను

షేక్‌ఫిరోజ్‌బాషా, షేక్ మొహమ్మద్ ఆహిల్, షేక్ మొహమ్మద్ ఆమన్

- పెళ్లింట విషాదం
- రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం
- పెళ్లికుమారునితో సహా రక్తసంబంధీకులంతా మరణం
- మృతులంతా ఒకే కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-గుత్తి

అనంతపురం నగరం బిందెల కాలనీలో నివాసం ఉంటున్న షేక్ అలీ సాహెబ్ రెండవ కుమారుడు షేక్ ఫిరోజ్ బాషాకు వివాహం జూన్6వ తేదీ జరగనుంది. వివాహ దుస్తుల కొనుగోలు నిమిత్తం శుక్రవారం నాడు హైదరాబాద్‌కు రెండు కార్లలో కుటుంబ సభ్యులు అందరూ వెళ్లారు. ఒక కారులో షేక్ ఆలీసాహెబ్(58), అతని కుమారుడు, పెళ్లికుమారుడు షేక్‌ఫిరోజ్‌బాషా(28), మనవళ్లు షేక్ మొహమ్మద్ ఆహిల్(6), షేక్ మొహమ్మద్ ఆమన్ (4), తమ్ముని భార్య షేక్ రెహనాబాను(44), పెద్ద కోడలు షేక్ జహీదా(32)తో పాటు మహమ్మద్ గౌస్‌లు వెళ్లారు. అక్కడ దుస్తులు కొనుగోలు చేసి శనివారం వేకువజామున అనంతపురం బయల్దేరారు. శనివారం ఉదయం 6గంటల సమయంలో కారు గుత్తి సమీపంలోని బాటసుంకులమ్మ ఆలయం 44వ జాతీయ రహదారిపై వస్తుండగా డ్రైవింగ్ చేస్తున్న షేక్ మొహమ్మద్ గౌస్ నిద్రమత్తులో కాస్త తూగాడు. దీంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. వేగంగా వస్తూ డివైడర్‌ను ఢీకొనడంతో కారు ఎగిరి కుడి వైపున వస్తున్న లారీని తగిలింది. రెండు వాహనాలు వేగంగా ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న షేక్ అలీసాహెబ్, అతని కుమారుడు షేక్ ఫిరోజ్ బాషా, మనవళ్లు షేక్ మొహమ్మద్ అహిల్, షేక్ మొహమ్మద్ అమన్ తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే మరణించారు. షేక్ అలీ సాహెబ్ సోదరుని భార్య ఎస్.రెహనాభాను, కోడలు షేక్ జహీదా, మహమ్మద్ గౌస్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం విషయం తెలుసుకున్న సిఐ ఎం.వెంకటరామిరెడ్డి, ఎస్ఐ బి.నబీరసూల్ వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఎస్.రెహనా భాను మరణించింది. గాయపడ్డ ఎస్.జహీదా, షేక్ మహమ్మద్ గౌస్‌లను మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ జహీదా మరణించారు. ఈ ఘటనతో ఒక్కసారిగా బాధితుల కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పెళ్లి జరగాల్సిన ఇంట్లో ఇలా మరణాలు సంభవించడం అందరినీ కలిచి వేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాద ఘటనా స్థలంలో కారులోనే మరణించిన షేక్ ఆలీసాహెబ్ కుటుంబ సభ్యులు

భద్రత కట్టుదిట్టం

- కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ మాధవ రెడ్డి

ప్రజాశక్తి-లేపాక్షి, హిందూపురం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోల్డ్ ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను కట్టుదిట్టంగా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.అరుణబాబు, ఎస్పీ మాధవరెడ్డి తెలియజేశారు. ఈవీఎం, వివిప్యాట్‌లు భద్రపరచిన హిందూపురం బిట్ కళాశాల, లేపాక్షి మండలం చోళసముద్రం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లను శనివారం తనిఖీ చేశారు. భద్రతాపరమైన అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు జారీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత విషయంలో ఈవిఎంలు, వివిప్యాట్‌ల సురక్షిత తదితర అంశాలపై జిల్లా ఎస్పీతో కలిసి కార్యాచరణ రూపొందించామన్నారు. బిట్ కళాశాలలో మడకశిర,కదిరి, పెనుగొండ, హిందూపురం, హిందూపురం పార్లమెంట్ స్థానానికి సంబంధించిన ఈవిఎం, వివిప్యాట్‌లను భద్రపరిచామన్నారు. లేపాక్షి పట్టణ సమీపంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పుట్టపర్తి, ధర్మవరం హిందూపురం పార్లమెంటుకు సంబంధించిన ఈవిఎం, వివిప్యాట్‌లను భద్రపరిచామన్నారు. జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌లో వద్ద మూడు అంచెల భద్రతను ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాలతో నిరంతర పరిశీలన ఉంటుందన్నారు. స్ట్రాంగ్ రూమ్ చుట్టు పక్కల 144 సెక్షన్ అమల్లో ఉన్నదని ప్రజలు ఎవరూ ఈ ప్రాంతం చుట్టుపక్కల సంచరించరాదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, పుట్టపర్తి నియోజకవర్గం ఆర్వో భాగ్యరేఖ, ధర్మవరం నియోజకవర్గ ఆర్వో వెంకట శివసాయి రెడ్డి, మడకశిర నియోజకవర్గ ఎన్నికల అధికారి గౌరీ శంకర్ పాల్గొన్నారు.

16 మండలాల్లో 368.2 మి॥మీ॥ వర్షపాతం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శ్రీసత్య సాయి జిల్లాలో 32 మండలాల పరిధిలో 16 మండలాల్లో శుక్రవారం రాత్రి వర్షం కురిసింది. శనివారం రెవెన్యూ వారి గణాంకాల ప్రకారం 368.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యధికంగా రొద్దం మండలంలో 60.2 మిమీ వర్షపాతం నమోదయింది. అతి స్వల్పంగా హిందూపురం, తలుపుల లో 2.2 మిమీ వర్షపాతం నమోదు అయ్యింది. తనకల్లులో 52.6 మిమీ, గాండ్లపెంటలో 52.4, మడకశిరలో 51.6, నల్లచెరువులో 29.0, కదిరిలో 28.2 మిమీ వర్షపాతం నమోదయింది. లేపాక్షి, బత్తలపల్లి, గుడిబండ, ఎన్‌పి.కుంట, తాడిమర్రి, అమరాపురం, కనగానిపల్లి, రామగిరి తదితర మండలాల్లో ఒక మోస్తారు వర్షం కురిసినట్లు రెవెన్యూ గణాంకాల అధికారి గంగాధర్ తెలిపారు. కాగా శనివారం మేఘావతం అయ్యి ఉండడంతో ప్రజలకు ఉక్కపోత నుండి కాస్త ఉపశమనం కలిగింది.

ఘటనా స్థలంలో జెసిబిలతో శిథిలాలను తొలగిస్తున్న సిబ్బంది

కూలిన ప్రయివేటు వెంచర్ ఆర్చ్

ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మృతి

అనంతపురం జిల్లా కూడేరు మండలం గొటుకూరు గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న ఓ ప్రయివేటు వెంచర్ ఆర్చ్ కూలింది. ఈ సమయంలో నిర్మాణ పనులు చేస్తున్న ఇద్దరు కూలీలు శిథిలాల కింద పడి మరణించారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతి చెందిన ఇద్దరూ మధ్యప్రదేశ్ రాష్ట్రం సుల్కారిక్ గ్రామానికి చెందిన పురాన్ సింగ్ (21), ఆశాక్(22)గా గుర్తించారు. ఇదే ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన తిహార్, అనంతపురం రూరల్ మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన నాగరాజు, ఆంజనేయులు గాయపడ్డారు.

వార్త మెయిన్‌లో

అనంత ఎస్పీగా గౌతమి శాలి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎస్పీ గౌతమి శాలి

అనంతపురం జిల్లా ఎస్పీగా గౌతమి శాలి నియమితు లయ్యారు. 2015 బ్యాచ్‌కు చెందిన గౌతమి శాలి గతంలో కర్నూలు జిల్లా అదనపు ఎస్పీగా పనిచేశారు. ఆ తరువాత విశాఖపట్నం డిసిపిగానూ, విజయనగరంలో 16వ బ్యాటలియన్ కమాండెంట్‌గానూ పనిచేశారు. ఇప్పుడు అనంతపురం జిల్లా ఎస్పీగా నియమితులయ్యారు. జిల్లాలో ఎన్నికల అనంతరం నెలకొన్న పరిణామాల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ముందున్న ఎస్పీ అమిత్ బర్దర్‌ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల అనంతరం తాడిపత్రిలో జరిగిన అల్లర్లను అదుపు చేయడంలో విఫలమయ్యారన్న ఉద్దేశ్యంతో ఆయన్ను సస్పెండ్ అయ్యారు. ఆ స్థానంలో ఇప్పుడు కొత్త ఎస్పీగా గౌతమి శాలిని నియమించారు.

డిఎంఎల్‌టి స్టేట్ టాపర్‌గా నితిన్

ప్రజాశక్తి-అనంతపురం

ఆంధ్రప్రదేశ్ స్టేట్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ నిర్వహించిన పారామెడికల్ కోర్సులోని డిప్లమో ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీలో అనంత యువకుడు దబ్బర నితిన్‌చౌదరి స్టేట్ టాపర్‌గా నిలిచాడు. రాష్ట్రంలో డిఎంఎల్‌టి కోర్సులో 23 మంది డిస్టెంక్షన్‌లో పాసయ్యారు. వీరిలో 9మంది అనంతపురంలోని సీడ్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీకి చెందిన విద్యార్థులు ఉండటం గమనార్హమని కళాశాల కరస్పాండెంట్ ప్రత్తిపాటి రంగనాయకులు తెలిపారు. రాష్ట్ర పారామెడికల్ చరిత్రలోనే 84.16 శాతం ఉత్తీర్ణతతో ఎక్కువ మార్కులు సాధించిన నితిన్ ఖ్యాతి పొందాడన్నారు. ఈ కార్యక్రమంలో సీడ్స్ కళాశాల కరస్పాండెంట్ రంగనాయకులు, డైరెక్టర్ కార్తీక్, అధ్యాపకులు డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, భరత్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎప్పుడేం జరుగుతుందో..?

- నివురుగప్పిన నిప్పులా తాడిపత్రి
- కత్తిమీద సాములా పోలీసు విధులు
- పోలింగ్ అనంతరం అదుపుతప్పిన శాంతిభద్రతలు

పోలింగ్ అనంతరం తాడిపత్రిలో రాళ్లు రువ్వుకుంటున్న టిడిపి, వైసిపి మద్దతుదారులు (ఫైల్‌ఫొటో)



జెసి.ప్రభాకర్‌రెడ్డి

కేతిరెడ్డి పెద్దారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఫ్యాక్షన్ ప్రాంతంగా పేరొందిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎన్నికలు అంటనే యుద్ధ వాతావరణాన్ని తలపిస్తాయి. ఎప్పుడు ఎక్కడ ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంటుంది. నివురుగప్పిన నిప్పులా ఉండే ఫ్యాక్షన్ మంటలు ఎన్నికల సమయంలో ఎగిసిపడుతుంటాయి. ఇటీవల కొంతకాలంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో చాలా వరకు ప్రశాంత వాతావరణమే ఉంటూ వచ్చింది. తాడిపత్రిలో మాత్రం అవి అప్పుడప్పుడు ఎగిసిపడుతూనే ఉన్నాయి. అక్కడి టిడిపి నాయకులు జెసి.ప్రభాకర్ రెడ్డి, వైసిపి నాయకులు కేతిరెడ్డి పెద్దారెడ్డిల మధ్య కొన్ని దశాబ్దాల వైరముంది. ఇవి ఎప్పుడు ఎన్నికలొచ్చినా ఏదో రూపంలో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంటూనే ఉంటుంది. 2004 సార్వత్రిక ఎన్నికల సమయంలో నామినేషన్ వేసే సమయంలో తాడిపత్రిలో పెద్దఎత్తున ఘర్షణ చోటు చేసుకుంది. అప్పుడు కాంగ్రెస్ పార్టీలో జెసి.ప్రభాకర్‌రెడ్డి ఉండగా, తెలుగుదేశం పార్టీలో కేతిరెడ్డి పెద్దారెడ్డి ఉండేవారు. నామినేషన్ వేసేందుకు జెసి.దివాకర్‌రెడ్డి వెళ్తున్న సమయంలో పరస్పరం బాంబులు వేసుకున్నారు. 2009, 2014లో కేతిరెడ్డి కుటుంబం తాడిపత్రిలో కాకుండా ధర్మవరం అసెంబ్లీపై దృష్టి సారించారు. 2019 ఎన్నికలకు ముందు కేతిరెడ్డి పెద్దారెడ్డి వైసిపి అభ్యర్థిగా తాడిపత్రిలో అడుగు పెట్టే సమయంలోనూ ఉద్రిక్తత పరిస్థితులే నెలకొన్నాయి. వీటి నడుమే 2019 ఎన్నికలు జరిగాయి. తాడిపత్రిలో మూడు దశాబ్దాలకుపైగా ఓటమన్నది ఎరుగకుండా ఉంటూ వచ్చిన జెసి.కుటుంబం 2019 ఎన్నికల్లో తొలిసారిగా ఓటమిని చవిచూసింది. కేతిరెడ్డి పెద్దారెడ్డి తొలిసారిగా తాడిపత్రి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటి నుంచి ఇక్కడ పట్టుకై పెద్దారెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఓటమితో కోల్పోయిన తమ పట్టును సాధించేందుకు జెసి కుటుంబం సైతం పావులు కదుపుతూనే ఉంది. ఈ తరుణంలోనే గడిచని ఐదేళ్లుగా తాడిపత్రి నివురుగప్పిన నిప్పులానే ఉంటూ వచ్చింది. మున్సిపల్ ఎన్నికల సమయంలో పెద్దారెడ్డి నేరుగా జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇంటికెళ్లి కుర్చీలో కూర్చోనివచ్చి సవాల్ విసిరారు. ఆ సమయంలోనూ రెండు వైపుల ఉద్రిక్తత పరిస్థితులకు మరింత ఆజ్యం పోశాయి. ఇక మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా టిడిపి అత్యధిక స్థానాలు గెలుపొంది ఛైర్మన్ స్థానాన్ని దక్కించుకుంది. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్‌గా జెసి.ప్రభాకర్‌రెడ్డి అయ్యారు. టిడిపి నుంచి ఛైర్మన్ అభ్యర్థి అయ్యాక ప్రభాకర్‌రెడ్డి, పెద్దారెడ్డిల మధ్య పట్టణంలో ప్రతి విషయంలోనూ వివాదమే చోటు చేసుకుంటూ వస్తోంది. అభివృద్ధికి అడ్డుపడుతున్నారంటూ పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికలు రావడంతో ఆధిపత్యపు పోరు తీవ్ర స్థాయికే చేరింది. ఎన్నికల రోజు ఇవి మరోమారు రాజుకుని మంటలు చెలరేగడానికి కారణమయ్యాయి. ఈ విషయాలను పెద్దగా పరిగణలోకి తీసుకోని పోలీసు అధికార యంత్రాంగం కొంత నిర్లిప్తతతో వ్యవహరించిందన్న విమర్శలున్నాయి. ముఖ్య నేతల కదలికలను గుర్తించడం, వారిని కట్టడి చేసే విషయంలో విఫలవమడంతో మూడు రోజుల పాటు తాడిపత్రిలో యుద్ధ వాతావరణాన్ని తలపించింది. ఇప్పుడు అధికారులపై వేటుపడే దాక వచ్చింది. కొత్త ఎస్పీగా గౌతమి శాలిని నియమించారు. వచ్చిన తక్కువ సమయంలో ఇక్కడి పరిస్థితులను అర్థం చేసుకుని ఏ మేరకు ఈ ఆధిపత్యపు పోరుకు కట్టడి చేయగలరో చూడాల్సి ఉంది.

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిని ఇస్తున్న సిపిఎం నాయకులు

మార్కెట్ బహిరంగ వేలంపై

విచారణ జరపాలి : సిపిఎం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో పురపాలక సంఘ ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన వాణిజ్య సముదాయ భవనం, కూరగాయల మార్కెట్, బస్టాండ్ ఆవరణంలో కూరగాయల టోకు వ్యాపారులకు కేటాయించిన మున్సిపల్ స్థలాలపై కలెక్టర్ వెంటనే విచారణ చేపట్టాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. గత రెండు రోజులుగా మార్కెట్, పూల మార్కెట్, బస్టాండ్ లో ఉన్న ఖాళీ స్థల కేటాయింపుల్లో జరిగిన అవినీతిపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం రూపంలో వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీనిపై స్థానిక అధికారులు స్పందించకపోవడంతో సిపిఎం నాయకులు శనివారం నాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద మార్కెట్ వ్యవహారంలో జరిగిన అవినీతిపై కలెక్టర్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్లుకు వినితిని అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు జెడ్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన వాణిజ్య సముదాయ భవనం, కూరగాయల మార్కెట్ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల నిర్మాణం చేసి రెండు సంవత్సరాలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ప్రధాన కారణం అధికారులు, వ్యాపారులు ఒకటి కావడమే అన్నారు. కూరగాయల వ్యాపారులకు కేటాయించిన స్థలం నుంచి పూల మార్కెట్ నిర్వహణకు కేటాయించిన స్థలం వరకు, కూరగాయల వ్యాపారులకు కేటాయించిన గదుల నుంచి కూరగాయల టోకు వ్యాపారులకు కేటాయించిన స్థలం వరకు భారీగా అవినీతి జరిగిందన్నారు. అవినీతిలో పాలకులతో పాటు అధికారులకు సైతం భాగస్వామ్యం ఉందన్నారు. మార్కెట్ అండర్ గ్రౌండ్‌లో ఎంపిక చేసిన చిరు వ్యాపారులకు స్థలాలు కేటాయిస్తామని, కౌన్సిల్ ఆమోదం తీసుకుని పూల వ్యాపారులకు కేటాయించారన్నారు. దీంతో చిరు వ్యాపారులు రోడ్డుపై పడ్డారన్నారు. వీటన్నింటిపైన కలెక్టర్ ప్రత్యేక దష్టి సారించి ప్రత్యేక అధికారులతో విచారణ జరిపించి, అవినీతికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సాంబశివ, రామకష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆ కుటుంబానికి 'గుండె'కోత..!

ప్రజాశక్తి-అనంతపురం

ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఓ కుటుంబంలో ఏకంగా ఐదుగురు చిన్నారులకు గుండె సమస్య తలెత్తింది. జన్మపరమైన సమస్యల కారణంగా కుటుంబంలో ఐదుగురికి గుండె సంబంధిత వ్యాధి సంక్రమించింది. శస్త్ర చికిత్స ఒకటే మార్గంగా ఉన్నా, కనీసం మందులు కొనలేని పరిస్థితిలో కుటుంబం ఉంది. ఈ విషయం తెలుసుకున్న అమ్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు తరిమెల రమణారెడ్డి తానున్నానంటూ చిన్నారుల గుండెకు రక్షణగా నిలిచారు. అవసరమైన వైద్యం ఖర్చులు అందించడంతోపాటు పూట గడవని స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి అండగా నిలిచారు.

వివరాల్లోకి వెళితే.. అనంతపురంలోని హమాలీ కాలనీలో నివసిస్తున్న నరసింహులు కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇతనికి భార్యతోపాట ఆరుగురు సంతానం ఉన్నారు. వీరిలో ఐదుగురు చిన్నారులు గుండె సమస్యతో బాధపడుతున్నారు. ఈనేపథ్యంలో బెంగుళూరు నారాయణ హృదయాలయ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయగా చిన్నారుల గుండెల్లో రంధ్రాలు ఉన్నాయని చెప్పారు. జన్యుపరమైన గుండె సంబంధిత వ్యాధి అని, ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఇందుకు ఒక్కొక్కరికి సుమారు రూ.1.5లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. మొత్తం ఐదుగురు చిన్నారులకు సుమార రూ.7.50లక్షలు అవసమవుతుంది.

చెక్కులు అందజేస్తున్న అమ్మ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రమణారెడ్డి

ఓవైపు ఆర్థిక పరిస్థితి.. మరోవైపు కుటుంబ పోషణ భారమైన నేపథ్యంలో పిల్లలకు మెరుగైన వైద్యం అందించలేని దుస్థితి. ఈ సమయంలో తమకు తెలిసిన వారు చెప్పిన సమాచారం మేరకు నగరంలో ఉన్న అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డిని ఆశ్రయించారు. వెంటనే స్పందించిన రమణారెడ్డి పిల్లల వైద్యం నిమిత్తం ఆపరేషన్‌కు కావాల్సిన రూ.7.50లక్షల చెక్కును అందజేశారు. అంతేగాకుండా తర్వాత ఖర్చులు, రవాణా సౌకర్యం మరో రూ.50వేలు అందించారు. భవిష్యత్తులో పిల్లలకు అవసరమైన మందులు, విద్యకు సాయం అందచేస్తానని భరోసా ఇచ్చారు. అడిగిన వెంటనే స్పందించి తమ పిల్లల ప్రాణాలు కాపాడిన అమ్మ సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డికి నరసింహులు కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

కుప్పకూలిన నిర్మాణంలో ఉన్న ఇల్లు - గూగూడులో ఘటన

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడు గ్రామంలో కుళ్లాయప్పకు చెందిన నిర్మాణంలో ఉన్న ఇల్లు ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. రంగాపురం కుళ్లాయప్ప గూగూడులో ఇల్లు నిర్మాణం చేపట్టాడు. మొదటి అంతస్తు నిర్మాణం పూర్తయింది. తర్వాత రెండో అంతస్తు నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇందులో భాగంగానే శనివారం కూడా సుమారు 20 మంది కూలీలతో రెండవ అంతస్తు స్లాబ్ వేశారు. అనంతరం మధ్యాహ్నం భోజనం సమయం కావడంతో కూలీలు భోజనానికి వెళ్లారు. ఈ సమయంలో ఉన్నట్టుండి భవనం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. కూలీలు భోజనానికి వెళ్లకుండా ఉంటే భారీ ఎత్తున ప్రాణనష్టం జరిగేదని స్థానికులు అంటున్నారు.

నేలమట్టమైన ఇల్లు

చెరువుల నిర్వహణపై నీలినీడలు.!

ఆక్రమణలకు గురవుతున్న వైనం.. పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

'వందలాది సంవత్సరాల క్రితం నుంచే మన పూర్వీకులు భూమి మీద ప్రవహించే వర్షం నీటిని నిల్వ చేయడానికి చెరువులు తవ్వించారు. ఈ చెరువు వల్ల ప్రజల నీటి అవసరాలు, పశు పక్షాదుల దాహార్తి తీరేది. తీవ్రమైన కరువు పరిస్థితుల్లో పంటల సాగుకు చెరువుల నీటిని ఉపయోగించేవారు. చెరువు నిర్మించడం వల్ల ప్రధానంగా నీటి ప్రవాహాన్ని అదుపు చేయవచ్చు. చెరువుల్లో నీటి నిల్వల ద్వారా సమీపంలోని గొట్టపు బావులు, బోరు బావులు, ఊట వంకల్లో నీటిమట్టం పెరుగుతుంది. ఇలా అనేక విధాలుగా ఉపయోగపడే చెరువులు మండల వ్యాప్తంగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. చెరువుల నిర్వహణ ప్రభుత్వం మండలానికి ఒక ఇరిగేషన్ అధికారిని నియమించింది. అయితే మండలానికి నియమితులైన ఇరిగేషన్ అధికారి తూతూ మంత్రంగా విధులు నిర్వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. మండల పరిధిలోని దేవరెడ్డిపల్లి, రెడ్డెన్నవారికుంట చెరువుల పరిమాణం క్రమేణా తగ్గిపోతుంది. ఆయా చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారు కరువయ్యారు. చెరువులు ఆక్రమణలకు గురవడం వల్ల వర్షం నీటి ప్రవాహం ఎక్కువై వృథా అవుతోంది. ఇక ధనియానిచెరువులో ఉండే ఎక్కువ భాగం గతంలో వచ్చిన వర్షాల వల్ల దెబ్బతింది. కాలువలు తెగిపోయాయి. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్ల మండల వ్యాప్తంగా చెరువులు ఆక్రమణలకు గురై రోజురోజుకూ వాటి విస్తీర్ణం తగ్గిపోతుంది. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండల పరిధిలో ఉండే చిన్న, పెద్ద చెరువులు, కుంటలని గుర్తించి మరువలు, కాలువలు, తూముల మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు కోరుతున్నారు.

సీబీఎస్ఈ బోధన అంశాలపై శిక్షణ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సీబీఎస్ఈ బోధన అంశాలపై ఉపాధ్యాయులకు మండల పరిధిలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో శిక్షణ తరగతులు నిర్వహించారు. శ్రీసత్యసాయి జిల్లాలోని 49 సీబీఎస్ఈ పాఠశాలల్లో సైన్స్, గణితం బోధించే ఉపాధ్యాయులకు ఈ నెల 17, 18 తేదీల్లో బోధన అంశాలపై శిక్షణ ఇచ్చారు. గణితం, సైన్స్‌కి సంబంధించి 113 మంది ఉపాధ్యాయులు శనివారం శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఉపాధ్యాయులకు రిసోర్స్ పర్సన్స్‌గా(ఎస్ఆర్‌పి/ డిఆర్‌పి) ఆరుగురు వ్యవహరించారు. శిక్షణ కార్యక్రమానికి కడప స్కూల్ ఎడ్యుకేషన్ ప్రాంతీయ సంచాలకులు వై.రాఘవరెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి, స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ ఇస్మాయిల్, ఉప విద్యాశాఖ అధికారి రంగ స్వామి, సీబీఎస్ఈ జిల్లా కోఆర్డినేటర్, ప్రిన్సిపల్ రమేష్‌బాబు హాజరయ్యారు. సీబీఎస్ఈ పాఠ్యాంశాల ను బోధించడం, మూల్యాంకనం, తదితర నైపుణ్యాలకు సంబంధించిన అంశాలపై నిపుణులచే శిక్షణ ఇచ్చారు. ఇంగ్లీష్, బయాలజీ, సోషియల్ సబ్జెక్టులకి సంబంధించిన ఉపాధ్యాయులకు ఈ నెల 20, 21 తేదీల్లో జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులకు అధికారులు సూచించారు.

ఆరోగ్య ఉపకేంద్రాల సందర్శన

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని జూలుకుంట, చల్లాపల్లి ఆరోగ్య ఉప కేంద్రాలను శనివారం జిల్లా టాస్క్ ఫోర్స్ టీం సందర్శించి రికార్డులు, ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. ప్రస్తుతం బిసిజి టీకా పొందిన గర్భిణులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులను పిలిపించి రక్తహీనత పరీక్ష నిర్వహించారా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. ఆయా ఆరోగ్య ఉప కేంద్రాలు అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్య ఉప కేంద్రాల సిబ్బంది సమయపాలన పాటిస్తూ, చిన్నచిన్న లోపాలను సరిదిద్దుకొని ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి హరికుమార్, డిపిఒ నాగరాజు, డిపిహెచ్ఎన్ ఈరమ్మ, మేనేజర్ సుబ్బారావు, పర్యవేక్షకులు రవీంద్ర రత్నమ్మ, సిహెచ్ఒ మనోహర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: PUTTAPARTHY
O.S.No: 41/2023

Between:
D. Pedda Obulesh Naik - Plaintiff
And
B. Narasimha Murthy - Defendant

Summons to Defendant

To,
B. Narasimha Murthy S/o B.Venkata Narasappa R/o Vengalammacheruvu Village, Puttaparthy Mandal.

Where as the plaintiff has filed the Original Suit No: 41/2023 for recovery of amount based on pronote against you and you are here by summoned to appear before this Hon'ble court in peson or by a pleader on 26-7-2024 at 10:30 AM to answer the same failing which the matter will be deposed off exparty.

// **By order of the Court**//

Hearing Date: 26-7-2024

Address of Service of Plaintiff
Sri M. Rajendra Prasad Reddy, *Advocate*
PUTTAPARTHY.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: PUTTAPARTHY
E.A.No: 23/2023 In E.P.No:20/2018 In O.S.No:169/2006

Between:
G. Viswantha - Petitioner / D.Hr
And
R. Venkata Siva Reddy - Respondent/J.Dr.

Notice to J.Dr.

To,
R. Venkata Siva Reddy S/o Rapati Nagi Reddy R/o Chennarajupalli H/o Bandlapalli, Kothacheruvu Mandal.

Where as the Petitioner/D.Hr has filed the E.A.No: 23/2023 In E.P. No: 20/2018 In O.S.No: 169/2006 for amendment against you and you are here by summoned to appear before this Hon'ble court in person or by a pleader on 1-8-2024 at 10:30 AM to answer the same failing which the matter will be deposed off exparty.

// **By order of the Court**//

Hearing Date: 1-8-2024

Address of Service of D.Hr
Sri M. Rajendra Prasad Reddy, *Advocate*
PUTTAPARTHY.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: PUTTAPARTHY
E.P.No:1/2020 In A.B.R.No:77/2014

Between:
Margadharsi Chit fund Pvt.Ltd
Hyderabad Rep. by its Manager Com Foreman - Petitioner / D.Hr
And
L. Sainath Reddy and Others - Respondent/J.Dr.

Notice to J.Dr. No.1

To,
L. Sainath Reddy S/o L. Nanji Reddy
R/o Brahmanapalli Village, Puttaparthy Mandal

Where as the Petitioner/D.Hr has filed the E.P. No: 1/2020 In A.B.R.No: 77/2014 for attachment of propeties against you and you are here by summoned to appear before this Hon'ble court in person or by a pleader on 28-6-2024 at 10:30 AM to answer the same failing which the matter will be deposed off exparty.

// **By order of the Court**//

Hearing Date: 28-6-2024

Address of Service of D.Hr
Sri M. Rajendra Prasad Reddy, *Advocate*
PUTTAPARTHY.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE: PENUKONDA
I.A.No: 402/2022 In I.P.No: 9/2019

Between:
Khaja Mynooddin - Petitioner
And
C. Subramanyam and Others - Respondents

Notice to Respondents No.12

To,
R12 P.Bhaskar Rao, Rtd. Bank Employee. R/o Near Water tank, Lakshmi Nagar, Ananthapuramu.

Whre as the petitioner has filed the I.A.No:402/2022 In I.P.No:9/2019 Under Section 5 Limitation act against you and you are here by summoned to apear before this Hon'ble court in person or by a pleader on 20-6-2024 at 10:30 AM to answer the same failing which the matter will be deposed off exparty.

// **By order of the Court**//

Hearing Date: 20-6-2024

Address of Service of Petitioner
Sri M. Rajendra Prasad Reddy, *Advocate*
PUTTAPARTHY.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: PUTTAPARTHY
E.P.No:1/2020 In A.B.R.No:77/2014

Between:
Margadharsi Chit fund Pvt.Ltd
Hyderabad Rep. by its Manager Com Foreman - Petitioner / D.Hr
And
L. Sainath Reddy and Others - Respondent/J.Dr.

Notice to J.Dr. No.1

To,
L. Sainath Reddy S/o L. Nanji Reddy
R/o Brahmanapalli Village, Puttaparthy Mandal

Where as the Petitioner/D.Hr has filed the E.P. No: 1/2020 In A.B.R.No: 77/2014 for attachment of propeties against you and you are here by summoned to appear before this Hon'ble court in person or by a pleader on 28-6-2024 at 10:30 AM to answer the same failing which the matter will be deposed off exparty.

// **By order of the Court**//

Hearing Date: 28-6-2024

Address of Service of D.Hr
Sri M. Rajendra Prasad Reddy, *Advocate*
PUTTAPARTHY.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: PUTTAPARTHY
O.S.No: 112/2022

Between:
Bavamma and Others - Plaintiffs
And
Pulletipalli Kullayappa and Others - Defendants

Summons to Defendants

To,
D5: Ameena D/o Silarappa W/o Kasim Bhandu Sab R/o Door No.4-1-484, 6th Road, Ananthapuramu Zone, Ananthapurami District
D6: Kullayamma W/o Kasim R/o Near Sathya Sai Water plant, Brahamanapalli
D8: Fakrobee D/o Kaseem, R/o Near Sathya Sai Water Plant, Brahamanapalli

Where as the plaintiff has filed the Original Suit No: 112/2022 for partition and separate possession against you and you are here by summoned to appear before this Hon'ble court in person or by a pleader on 24-7-2024 at 10:30 AM to answer the same failing which the matter will be deposed off exparty.

// **By order of the Court**//

Hearing Date: 24-7-2024

Address of Service of Plaintiff
Sri M. Rajendra Prasad Reddy, *Advocate*
PUTTAPARTHY.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: PUTTAPARTHY
O.S.No: 42/2023

Between:
E.S. Venkata Ramana - Plaintiff
And
Meda Chirappa Since deceased rep. by his Lrs the Defendants No. 1 to 7 - Defendants

Summons to Defendants

To,
D2: Meda Lakshmi Narayana S/o Meda Chirappa Aged about 50 years
D3: Meda Nagabhusana S/o Meda Chirappa Aged about 45 years
D4: Meda Ramesh S/o Meda Chirappa Aged about 38 years
D5: Meda Gangamma D/o Meda Chirappa Aged about 48 years
D6: Chintakayala Lakshmi Narayanamma D/o Meda Chirappa Aged about 45 years
D7: Meda Subhadramma D/o Meda Chirappa Aged about 38 years
All are Hindus, Agriculturist, R/o Vengalammacheruvu Village, Puttaparthy Mandal.

Where as the plaintiff has filed the Original Suit No: 42/2023 for recovery of amount based on pronote against you and you are here by summoned to appear before this Hon'ble court in person or by a pleader on 9-8-2024 at 10:30 AM to answer the same failing which the matter will be deposed off exparty.

// **By order of the Court**//

Hearing Date: 9-8-2024

Address of Service of Plaintiff
Sri M. Rajendra Prasad Reddy, *Advocate*
PUTTAPARTHY.

పుట్టపర్తిలో పెరిగిన ఓటింగ్ శాతం

ఎవరికి లాభమో..?

గెలుపుపై ఇరు పార్టీల్లో ధీమా

దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

పల్లె సింధూర రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ ముగిసి 6 రోజులైంది. దీంతో పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి గెలుపుపై ఎవరికి వారు ధీమాతో ఉన్నారు. ఆయా పార్టీ శ్రేణులు వేల మెజార్టీతో తామే గెలవబోతున్నామని లెక్కలు కడుతున్నాయి. మరోవైపు నియోజకవర్గంలో భారీగా పెరిగిన ఓటింగ్ శాతం(86.27) ఎవరికి లాభం చేస్తుందో అనే చర్చ సర్వత్రా సాగుతోంది. ఇరు పార్టీల నాయకులు ఊహల పల్లకిలో ఊరేగుతున్నారు. వైసిపి నాయకులు వారి సమీక్షలో సిట్టింగ్ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి 20 వేల పై చిలుకు మెజార్టీతో గెలవబోతున్నారని అంచనా వేస్తున్నారు. సిఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి వల్లే ముఖ్యంగా మహిళలు, పింఛనుదారులు, యువత భారీగా ఓటింగ్‌లో పాల్గొన్నారని, వైసిపి విజయం ఖాయమని ఆ పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. మరొకవైపు టిడిపి నాయకుల లెక్కల ప్రకారం మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కోడలు ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరరెడ్డి 15 వేల పైచిలుకు మెజార్టీతో గెలవబోతున్నారని తెలుగుతమ్ముళ్లు చెబుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గత ఐదేళ్లలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టనందున ఆయనపై అసంతృప్తితో మెజారిటీ ఓటర్లు టిడిపి వైపు మొగ్గు చూపారని పేర్కొంటున్నారు. అంతేగాక చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలు నమ్మారన్నారు. ముఖ్యంగా మహిళలు, రైతుల కోసం ఈ పథకాలు ఎంతగానో ఉపయోగపడతాయని పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. అంతేగాక ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో 80 శాతం టిడిపికి అనుకూలంగా పడ్డాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే రాజకీయ విశ్లేషకులు మాత్రం ఎవరు గెలిచినా 3 వేల నుంచి 5 వేల లోపు మెజార్టీ మాత్రమే ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా గెలిచేదెవరు.. మెజార్టీ ఎంత అనే విషయాలు తెలియాలంటే జూన్ 4వ తేదీ వరకూ వేచిచూడాల్సిందే.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి బలిజ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆ కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీలో దాదాపు వంద కుటుంబాలు ఉన్నాయన్నారు. నెల రోజులుగా కాలనీకి సక్రమంగా తాగునీరు సరఫరా చేయడం లేదని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వారానికి ఓ సారి మాత్రమే నీరు వదులుతున్నారని, ఈ విషయంపై వాటర్ మెన్‌ను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని వాపోయారు. మా కాలనీకి గేట్ వాల్ ఏర్పాటు చేసి సక్రమంగా నీరు సరఫరా చేయాలని కమిషనర్‌ను కోరామన్నారు. స్పందించిన కమిషనర్ తగిన చర్యలు తీసుకుని బలిజ కాలనీకి సక్రమంగా నీరు సరఫరా చేయిస్తామని హామీ ఇచ్చాడన్నారు. కార్యక్రమంలో ఆ కాలనీ మహిళలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై వినతి పత్రం ఇస్తున్న బలిజ కాలనీవాసులు

మొబైల్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-కొత్తచెరువురూరల్

బాలలు అనునిత్యం మొబైల్ చూడటం అనేది మంచి పరిణామం కాదని, వారు ఆన్‌లైన్‌లో వేధింపులకు గురి కాకుండా తల్లిదండ్రులు తగిన చర్యలు తీసుకోవాలని మేధావులు సూచించారు. మండల పరిధిలోని పాతదేవరపల్లి, కొడపగానిపల్లి గ్రామాల్లో శనివారం చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, ప్రభాత్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ, జిల్లా బాలల పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వ ర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ మొదట తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో జరిగే మోసపూరిత విషయాలు అర్థం చేసుకుని పిల్లలకు స్నేహపూర్వక వాతావరణంలో తెలియజేయా లన్నారు. పిల్లలతో ఉండి వారు చెప్పే విషయాలు వినడానికి సరైన సమయం కేటాయించాలని తెలిపారు. విషయ పరిజ్ఞానం పెంచుకోవడానికి మాత్రమే మొబైల్ ఉపయోగించే విధంగా చూసుకునే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని కోరారు. ఏ పిల్లలు అయితే తల్లిదండ్రుల దగ్గర ప్రేమ, ఆప్యాయత, అనురాగం నేర్చుకుంటారో ఆ పిల్లలే సమాజంలో మంచి పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతో పాటు సంస్కారం నేర్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అవగాహన సదస్సులో చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా ప్రతినిధి కొండప్ప, పిఆర్‌డిఎస్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, చంద్రాయుడు, నరేష్, భారతి, శ్రీధర్, జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రొటెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి, సోషియల్ వర్కర్ వనజాక్షి, కౌన్సిలర్ శివలత, మేఘన, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ జయంతి వేడుకలు

హిందూపురం : పట్టణంలో శనివారం వాసవీ జయంతి వేడుకలను ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో భారీగా ద్విచక్ర వాహనాల ర్యాలీ చేపట్టారు. అనంతరం శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు జెపికె.రాము, శ్రీకాంత్, పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

కొత్తచెరువు రూరల్ : కొత్తచెరువులో వెలసిన వాసవీమాత జయంతి కార్యక్రమాన్ని శనివారం ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వాసవీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల గుండా ఊరేగించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యుల సంఘం నాయకులు ప్రకాష్, వెంకటనారాయణ, పార్థసారథి, నాగేంద్ర, హరి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి : రిటైర్డ్ డీఎస్పీ లక్ష్మణ్‌గౌడ్

కొత్తచెరువురూరల్ : మండల పరిధిలోని లోచర్ల గ్రామంలో వెలసిన శ్రీఆం జనేయస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రిటైర్డ్ డీఎస్పీ లక్ష్మణ్‌గౌడ్ తెలిపారు. గతంలో గ్రామ ప్రజల సహకారంతో ఈ ఆలయా న్ని నిర్మించారు. ఆయన శనివా రం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధిపై గ్రామస్తులతో చర్చించారు. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పివి.సూర్యనారాయణ, పివి.రాజుదేవ్, గ్రామస్తులు లోచర్ల పెద్దన్న, అశోక్‌రెడ్డి, సూరి, తదితరులు పాల్గొన్నారు.

భవితవ్యం నిక్షిప్తం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రజాస్వామ్యంలో ఐదేళ్లకు ఒకసారి ప్రజలు తమ పాలకులను ఎన్నుకుంటుంటారు. గడిచిన ఐదేళ్లలో పాలకుల పని తీరుకు ఇది పరీక్షతోపాటు, రాబోయే ఐదేళ్ల పాలన ఏరకంగా ఉండాలని నిర్ణయించేందుకు ఎంచుకున్న మార్గం ఈ ఓటింగు పద్ధతి. గత వారంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పూర్తయ్యాయి. ప్రజలు భవిష్యత్తుపై అనేక ఆకాంక్షలతో తమ అభిప్రాయాలను ఓట్లరూపంలో తెలియజేశారు. ఈనెల 13న ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెద్దఎత్తునే పోలింగ్ జరిగింది. ప్రజలు ఎంతో ఉత్సహంతో తమ అభిప్రాయాలను ఓటురూపంలో తెలియజేశారు. అయితే తీర్పు వెలువడాల్సి ఉంది. ఇందుకోసం మరో రెండు వారాలు వేచి చూడాల్సి ఉంటుంది. ఎందుకంటే దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ ఎన్నికల్లో తక్కిన మూడు విడతల ఎన్నికలు పూర్తయిన తర్వాత ఒకేసారి ఓట్ల లెక్కింపు ఉంటుంది. అంతవరకూ ప్రజా తీర్పు ఇవిఎం యంత్రాల్లో నిక్షిప్తమై ఉంటుంది. ఓటింగ్ సజావుగా పూర్తయినప్పటికీ ఆ రోజు నుంచి తాడిపత్రి లో వైసిపి, టిడిపి వర్గీయుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ మంటలు ఇప్పటికీ చల్లారలేదు. మూడు రోజులుగా వరుసగా రెండు గ్రూపుల మధ్య యుద్ధ వాతావరణమే చోటు చేసుకుంది. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్ కావడంతో అనంతపురం జిల్లా ఎస్పీపై సస్పెన్షన్ వేటు కూడా పడింది. ఈయనతోపాటు డీఎస్పీ, సిఐలు ఇతర అధికారులపైనా ఎన్నికల సంఘం వేటు వేసింది. ఇంతటితోనే ఆగకుండా బాధ్యులైన వారు తేల్చి వారిపైనా కేసులు నమోదు చేయాలని ఆదేశించడం పెద్ద చర్చనీయాంశం అవుతోంది. ఇప్పటికే ముఖ్య నేతలనూ స్థానికంగా లేకుండా బయటి ప్రాంతాలకు పంపారు. అలాగే కేంద్ర భద్రతా బలగాలు కూడా తాడిపత్రికి విచ్చేశాయి. ఈ బలగాలు ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత కూడా ఇక్కడే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇకపోతే ఎన్నికల వేడితోపాటు వాతవరణం వేడి తగ్గుముఖం పట్టింది. ఉమ్మడి జిల్లాలో ఈవారంలో అక్కడక్కడ వర్షాలు పడటమే ఇందుకు కారణం. దీంతో అంతకమునుపు వరకూ 43 డిగ్రీ వరకూ ఉన్న ఉష్ణోగ్రత ఇపుడు 38లోపు ఉంటోంది. 15 రోజుల తర్వాత ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు వర్షాలు పడుతుండటంతో రైతుల్లో ఉత్సహాన్ని నింపుతోంది. దీంతో సాగుకు సమయత్తమవుతున్నారు. తొలకరి వర్షాలకు పొలాలను సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు. ప్రభుత్వం కూడా సబ్సిడీ విత్తన పంపిణీకి రిజిస్ట్రేషన్లు మొదలు పెట్టింది. మే 24 నుంచి జిల్లాలో వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తామని ప్రకటించడంతో శనివారం నుంచే ఈ ప్రక్రియ ప్రారంభమైంది. వచ్చే వారంలోనూ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ చెబుతోంది. దీంతో రాబోయే ఖరీఫ్‌పై రైతుల్లో ఆశలు మొలుకెత్తుతున్నాయి. గతేడాది వర్షాభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈసారైనా మంచి వర్షాలు పడి పంటలు పండితే బాగుంటుందని రైతులు ఆశిస్తున్నారు.

'బిపి'ని నిర్లక్ష్యం చేయొద్దు

ధర్మవరం టౌన్ : హైపర్ టెన్షన్(బిపి) అనే వ్యాధి పట్ల ప్రజలు తప్పనిసరిగా నిర్ధారించుకొని తగిన వైద్య చికిత్స పొందాలని రిటైర్డ్ కంటి వైద్యాధికారి, డాక్టర్ నరసింహులు సూచించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బీపీ అనేది సర్వసాధారణమైన జబ్బు అని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బీపీ పట్ల నిర్లక్ష్యంగా ఉంటే పెద్ద ప్రమాదానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ సమీప ప్రభుత్వ ప్రయివేటు ఆసుపత్రులలో బీపీ పరీక్షలు చేయించుకుని నిర్ధారణ అయితే తగిన మందులు వాడాలని తెలిపారు. ప్రతి 6 నెలలకు ఓ సారి తప్పక బీపీ స్థాయిలను నిర్ధారించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే అది ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు.

వాహనాల తనిఖీ.. రూ. 30 వేలు జరిమానా

ధర్మవరం టౌన్ : స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం పట్టణంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు ఎంవిఐ వరప్రసాద్ వాహనాలకు సంబంధించిన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లను తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని 5 వాహనాలకు మొత్తం రూ. 30వేలు జరిమానా విధించినట్లు ఎంవిఐ తెలిపారు. ఎవరైనా రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే జరిమానాతో పాటు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవిఐ వరప్రసాద్

కుక్కలదాడిలో 36 గొర్రెలు మృతి

గాండ్లపెంట : మండల పరిధిలోని కటారుపల్లి పంచాయతీలోని గొల్లపల్లి గ్రామంలో శనివారం కుక్కల దాడిలో 36 గొర్రెలు మృతి చెందాయి. బాధితుడు ఆదెప్ప తెలిపిన వివరాలు.. ప్రతిరోజూ లాగే శుక్రవారం యథావిధిగా మేతకు అడవికి వెళ్లి వచ్చిన గొర్రెలను సాయంత్రం 6 గంటల సమయంలో మందలో తోలి నిద్రపోయాడు. ఆ సమయంలో కుక్కలు దాడి చేయడంతో 36 గొర్రెలు మృతి చెందాయి. దీంతో రూ. 3 నుంచి రూ. 4 లక్షల నష్టం వాటిల్లిందని, గొర్రెలే జీవనాధారంగా బతుకుతున్న తనను ప్రభుత్వం ఆదుకోవాలని ఆదెప్ప కోరారు. సమాచారం అందుకున్న పశువైద్యాధికారి బి.వెన్నకేశవ నాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని కుక్కల దాడిలో మృత్యువాత పడిన గొర్రెల కళేబరాలను పరిశీలించి అక్కడే పోస్టుమార్టం చేశారు. బాధితుడు ఆదెప్పకు ప్రభుత్వం తరఫున న్యాయం చేస్తామనివెంటనే పశు వైద్యాధికారి హామీ ఇచ్చారు.

ఖాద్రీశుని ఆలయానికి భక్తుల తాకిడి

కదిరి అర్బన్ : పట్టణంలో వెలసిన శ్రీమద్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం శనివారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. వేసవి సెలవులు, శనివారం కావడంతో రాష్ట్రం నుంచే కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. స్వామి దర్శనార్థం తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు దీపాలు వెలిగించి స్వామి వారికి మొక్కు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు, తులా భారం రూపంలో మొక్కు సమర్పించుకున్నారు. భక్తుల సౌకర్యం కోసం ఆలయ శ్రీఘ్రదర్శనం, ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనం క్యూలైన్లు ఏర్పాటుచేశారు. అనంతరం నైవేద్య ప్రసాదం వితరణతో నిత్య అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

కంటి సంరక్షణకు జాగ్రత్తలు తప్పనిసరి

హిందూపురం : కంటికి సంబంధించిన వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కంటి వైద్య నిపుణులు సూచించారు. పట్టణంలోని ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్, బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి సంయుక్తంగా శనివారం స్థానిక పాండురంగ నగర్‌లో ఉన్న లయన్స్ క్లబ్ కార్యాలయం ఆవరణలో 108వ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కుమార్ రాజా, ఉమారాణి మాట్లాడుతూ శిబిరంలో 325 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి 150 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారని, వీరిని బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ అనంతరం హిందూపురం తీసుకొస్తామని తెలిపారు. అనంతరం ఏప్రిల్‌లో ఆపరేషన్ చేయించుకున్న వారికి ఉచితంగా కళ్లజోడు పంపిణీ చేశారు. శిబిరంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు కలిపి లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, గంగాధర్‌గుప్తా, శంకర్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు సాక్షి, వైద్య ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఓబుళాపురంలో నీటి సమస్యను పరిష్కరిస్తాం

లేపాక్షి : మండలంలోని బిసలమనేపల్లి పంచాయతీ ఓబుళాపురం గ్రామంలో నీటి సమస్య నెలకొందని అందిన ఫిర్యాదు మేరకు శనివారం మండల నీటి పారుదల శాఖ అధికారిణి దివ్య గ్రామంలో పర్యటించి నీటి సమస్యపై ఆరా తీశారు. గ్రామానికి సంబంధించిన నీటిని అక్రమంగా పొలాలకు వాడుకుంటున్న వారికి నోటీసులు ఇస్తామని తెలిపారు. గ్రామంలో నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయని, నీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని, గ్రామంలో వెంటనే నీటి సమస్యను పరిష్కరిస్తామని ఆమె గ్రామస్తులకు తెలిపారు. బిజెపి మండల అధ్యక్షులు ఎం.నరసింహమూర్తి మాట్లాడుతూ గ్రామంలో వీధి కొళాయిల్లో నీరు వృథా చేస్తున్నారని, గేట్ వాల్‌లు ఏర్పాటు చేయాలని కోరారు.

నీటి సమస్యపై ఆరా తీస్తున్న అధికారిణి దివ్య

చారిత్రక ప్రాధాన్యతను కాపాడుదాం

హిందూపురం : రాజుల కాలంలో నెలకొల్పిన చారిత్రక ప్రాధాన్యతను కాపాడాలని కోరుతూ రూరల్ మండలంలోని చౌలూరు గ్రామంలో శనివారం కర్ణాటక ఇతిహాస అకాడమీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అకాడమీ సభ్యుడు కె.ధనపాల్, సభ్యులు గ్రామంలోని పురాతన ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి అక్కడ ఉన్న విజయనగర రాజుల కాలం నాటి రెండు శాసనాల సారాంశాలను గ్రామస్తులకు వివరించారు. పురాతన చారిత్రక ప్రాముఖ్యతను కాపాడాల్సిన బాధ్యత నేటి యువత, విద్యావంతులపై ఉందన్నారు. అనంతరం చారిత్రక ప్రాధాన్యతను తెలిపే కరపత్రాలు విడుదల చేశారు.

'పురం'లో ఫెడరల్ బ్యాంక్ ప్రారంభం

హిందూపురం : పట్టణంలోని ఎంఎఫ్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఫెడరల్ బ్యాంకు బ్రాంచ్‌తో పాటు ఏటీఎం, సేఫ్ డిపాజిట్ లాకర్లను శనివారం జిల్లా అదనపు న్యాయమూర్తి కంపల్లె శైలజ, జిల్లా ఆసుపత్రి వైద్యులు వెంకటరమణనాయక్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఖాతాదారులకు సకాలంలో నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమం లో ఆడిటర్ ఎస్ఎ.ప్రసాద్, ఫెడరల్ బ్యాంక్ బెంగళూరు జోన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, జోనల్ హెడ్ దిలీప్, డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్, తిరుపతి ఏరియా హెడ్ స్వాతిప్రియ, ఎల్ఐసి నరేంద్రనాథ్, చారుకీర్తి, కరణం శ్రీనివాసులు, స్థానిక మేనేజర్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఫెడరల్ బ్యాంక్ ప్రారంభోత్సవంలో పాల్గన్న న్యాయమూర్తి శైలజ

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-లేపాక్షి

ఖరీఫ్-2024కి సంబంధించి రాయితీ విత్తన వేరుశెనగ కోసం మండల పరిధిలోని ఆయా రైతులు శనివారం నుంచి వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి(ఏఓ) శ్రీలత సూచించారు. భూమి విస్తీర్ణం బట్టి రైతులకు రాయితీపై విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామని తెలిపారు.

మడకశిర : ఖరీఫ్-2024కి సంబంధించి మండల పరిధిలోని రైతులకు 40 శాతం సబ్సిడీతో విత్తన వేరుశెనగ పంపిణీ చేస్తామని, అందుకు సంబంధించి అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు మండల వ్యవసాయ అధికారి(ఏఓ) తిమ్మప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ విత్తన వేరుశనగ కావాల్సిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం లేదా వన్ బి జిరాక్స్, ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్ తీసుకెళ్లి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

హిందూపురం : ఖరీఫ్-2024కి సంబంధించి రాయితీ విత్తన వేరునగ అవసరం ఉన్న రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఏఓ సురేంద్రనాయక్ సూచించారు. ఆయన శనివారం ఆర్‌బికెలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు.

చిలమత్తూరు : ఖరీఫ్‌లో పంట సాగు కోసం మండలంలోని రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో విత్తన వేరుశెనగ అందిస్తున్నట్లు ఏఓ వంశీకృష్ణ తెలిపారు. రైతులు సంబంధిత ఆర్‌బికెలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అమడగూరు : ఖరీఫ్-2024కి సంబంధించి మండలంలోని మహమ్మాదాబాద్, జెకె.పల్లి, చినగానిపల్లి, అమడగూరు ఆర్‌బికెలకు విత్తన వేరుశనగ కాయలు వచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి(ఏఓ) వెంకటరమణాచారి తెలిపారు. ఏఓ శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఆ 4 ఆర్‌బికెలకు వంద క్వింటాళ్ల చొప్పున మొత్తం 400 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు వచ్చాయని తెలిపారు. మిగిలిన ఆర్‌బికెలకు త్వరలో వస్తాయని, పంపిణీ తేదీలను త్వరలో తెలియజేస్తామని తెలిపారు.